

# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

PRGI Reg.No: APTEL/26/A0309

KADAPA MANASSAKSHI - Telugu Daily



వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 | సంచిక : 220 | బుధవారం, 12 ఆగష్టు 2026 | పేజీలు : 4 | వెల.రూ.2/-


## రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్

**–ఆర్టీజీఎస్ నుంచి చేపట్టిన వివిధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు**



అమరావతి, ఆగస్టు 11: ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు.. ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందిస్తే జాతి నిర్మాణానికి సహకరించినట్టే. ప్రతి ఉద్యోగి.. ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలి. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్ టేకప్ చేయాలి. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగత్మకంగా చేస్తున్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ప్రభుత్వం మంచి పని చేస్తే ప్రజలు ఇన్ వాల్వ్ అవుతారనడానికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన స్పందనే నిదర్శనం. అలాగే వాస్తవాలను ప్రజలకు వివరించగలిగితే... ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారు. దీనికి కర్నూలులో డీఎస్సీ-2025 టీచర్ల చేపట్టిన కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ. నెలవారీ ఆర్థిక ప్రగతి నివేదికపై సమీక్షించాం. జూలై నెలలో 10.70 శాతం వృద్ధిని నమోదు చేయగలిగాం. ఎల్ నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుంది. ఇప్పుడే అసలు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. వీటిని అధిగమించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లకు మహిళా డ్రైవర్లు



నరసరావుపేట, ఆగస్టు 11: 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు మహిళా డ్రైవర్లను నియమించే దిశగా చర్యలు చేపడుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నరసరావుపేటలో నూతన 102 అంబులెన్స్ సేవలను ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 300 వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, మరో రెండు నెలల్లో 200 వాహనాలను ప్రారంభిస్తామని చెప్పారు. కొత్త వాహనాల్లో ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగులు, జీపీఎస్, అత్యవసర బటన్ వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు ఉచిత రవాణా సేవలను మరింత విస్తరిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. 102, 104, 108 సేవలను సమన్వయంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం అనంతరం మంత్రి స్వయంగా అంబులెన్స్ నడిపారు.

## ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50 విద్యుత్ సబ్సిడీ



పాలకొల్లు: ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌కు రూ.1.50 చొప్పున సబ్సిడీ అందించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పాలకొల్లులో మంగళవారం నిర్వహించిన ఆక్వా రైతుల కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ నిబంధనలతో సంబంధం లేకుండా అర్హులైన రైతులకు సబ్సిడీ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆక్వా రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా విద్యుత్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని, ఇందుకోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సబ్సిడీతో ఆక్వా రైతులకు ఎకరానికి సుమారు రూ.84 వేల వరకు ఆదా అవుతుందని, ప్రభుత్వం సుమారు రూ.1,100 కోట్ల భారాన్ని భరిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది ఆక్వా రైతులకు ఈ సబ్సిడీ ద్వారా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

## 'హర్ ఘర్ తిరంగా'లో ప్రజలంతా పాల్గొనాలి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలంతా చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ జాతీయభావాన్ని చాటాలని సూచించారు. త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని, ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు.

## ఇథనాల్ బ్లెండింగ్‌పై విమర్శలకు కిషన్‌రెడ్డి కౌంటర్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఇథనాల్ బ్లెండింగ్ విధానంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఖండించారు. ఇథనాల్ బ్లెండింగ్ విధానం కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభమైందని గుర్తుచేశారు. 2013లో ఇథనాల్ కొరత కారణంగా విదేశాల నుంచి దిగుమతులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలిచిందని, ప్రస్తుతం దేశీయ రైతులు అవసరానికి మించి ఇథనాల్ ఉత్పత్తి చేసే స్థాయికి చేరారని తెలిపారు. పెట్రోల్ బ్లెండింగ్ కోసం ఇథనాల్‌ను దేశీయ రైతులు, ఉత్పత్తిదారుల నుంచే సేకరిస్తున్నామని పేర్కొన్నారు. జు20





విధానంపై కేజ్రీవాల్ చేస్తున్న ప్రచారం తప్పుడు సమాచారంపై ఆధారపడి ఉందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## మారుమూల గ్రామాలకు అభివృద్ధి బాట..

## 158 ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం



అమరావతి, ఆగస్టు 11: రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యానికి అనుగుణంగా మరో 158 ఆవాసాలకు తొలిసారిగా రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్లతో 347 కిలోమీటర్ల మేర 146 రోడ్లు, 19 వంతెనలు నిర్మించనున్నారు. ఈ రహదారుల నిర్వహణకు ఐదేళ్ల కాలానికి అదనంగా రూ.24.47 కోట్లు విడుదల చేశారు. రహదారుల నిర్మాణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. నిర్మించే రోడ్లు కనీసం పదేళ్లపాటు ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. రహదారులు, వంతెనల నిర్మాణంతో మారుమూల గ్రామాలకు విద్య, వైద్యం, మార్కెట్ వంటి సౌకర్యాలు మరింత చేరువ అవుతాయని ఆయన పేర్కొన్నారు.

## కన్నబిడ్డను కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని వేదన: హోంమంత్రి అనిత



విజయవాడ, ఆగస్టు 11: గుంటూరు జిల్లా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా (24) మృతి చెందడం తీవ్ర విషాదకరమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడలోని డీసీపీ షిరీన్ బేగం నివాసానికి వెళ్లిన హోంమంత్రి, ఆమెను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నబిడ్డను కోల్పోయిన తల్లిని ఓదార్చి ధైర్యం చెప్పారు. చీరాల బీచ్‌కు వెళుతున్న సమయంలో ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో అఫీఫా ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని అనిత అన్నారు. 24 ఏళ్ల చిన్న వయసులోనే నిండు జీవితం ముగియడం అత్యంత బాధాకరమన్నారు. కన్నబిడ్డను కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా తీరని వేదన అని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న హోంమంత్రి, ప్రమాదంలో గాయపడిన వారి పరిస్థితిపై కూడా ఆరా తీశారు. ఈ విషాద సమయంలో షిరీన్ బేగం కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు. అఫీఫా మృతికి ప్రగాఢ సంతాపం తెలిపిన హోంమంత్రి అనిత, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం, మనోస్థైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily




# ఆటో డ్రైవర్లకు పోలీసుల అవగాహన



కడప, ఆగస్టు 11 (మనస్సాక్షి): జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప తాలూకా సీఐ జి. రాజేంద్రనాథ్ యాదవ్ మంగళవారం ఐటీఐ సర్కిల్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, యూనిఫాం ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా, వాహన సామర్థ్య ధ్రువపత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మోటారు వాహనాల చట్ట నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## దొమ్మర నంద్యాలలో పోలీసుల అవగాహన కార్యక్రమం



మైలవరం ఆగస్టు 11 (మనస్సాక్షి): మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామంలో ఎస్ఐ డాక్టర్ శ్యామ్ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్ఐ తెలిపారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: జిల్లా ఎస్పీ



కడప, ఆగస్టు 11 (మనస్సాక్షి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 392 కేసులు నమోదు చేసి రూ.86,435 జరిమానా విధించినట్లు తెలిపారు. కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం ప్రమాదకరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# గుంటూరులో కిసాన్ మేళా

గుంటూరు, ఆగస్టు 11 (మనస్సాక్షి): లాం ఫామ్‌లోని ప్రాంతీయ పరిశోధనా స్థానం కృష్ణ ఆడిటోరియంలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పులు, వాటి ప్రభావం పంటలపై ఎలా ఉంటుందనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలకు సంబంధించి నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, ప్రత్యామ్నాయ పంటల ఎంపికపై శాస్త్రవేత్తలు సూచనలు అందించారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలు, అధికారులతో నేరుగా చర్చించి పరిష్కారాలు పొందే అవకాశం కల్పించారు. కొత్త రకాల విత్తనాలు, సూక్ష్మ సేద్య పరికరాలు, బిందు, తుంపర సేద్య పరికరాలను ప్రదర్శించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్య, పట్టుపరిశ్రమ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో 102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు పునఃప్రారంభం

తిరుపతి, ఆగస్టు 11 (మనస్సాక్షి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవీకరించిన 102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు తిరుపతి జిల్లాలో మంగళవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు తిరుపతి కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఈ సేవలను అధికారికంగా ప్రారంభించనున్నారు. తల్లి, బిడ్డలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు ఈ సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులు హాజరై కవరేజ్ చేయాలని కోరారు.

# శ్రీకాకుళం రిమ్స్‌లో తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభం

శ్రీకాకుళం, ఆగస్టు 11 (మనస్సాక్షి): బాలింతలు, నవజాత శిశువులకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన 8 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను మంగళవారం ప్రారంభించనున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యుడు గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరై వాహనాలను ప్రారంభించనున్నారు. రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉదయం 11.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఈ వాహనాలు అందుబాటులోకి రానున్నాయి.

# కరువు సహాయక చర్యలు చేపట్టాలి: సీపీఐ



మదనపల్లె, ఆగస్టు 11 (మనస్సాక్షి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో కరువు పరిస్థితులు నెలకొన్నందున ములకలచెరువు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 'మార్పు కావాలి.. మార్పు రావాలి' పాదయాత్రను పెద్దపాళెంలో ప్రారంభించారు. రైతులు పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలై వలసలు వెళ్తున్నారని, వ్యవసాయ కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హంద్రీ--నీవా కాలువ ద్వారా నీటిని విడుదల చేసి భూగర్భ జలాలను పెంచాలని, పశువులకు మేత, తాగునీరు అందించేందుకు గడ్డి కేంద్రాలు, నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి కే. అంజనప్ప మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని, మల్లయ్యకొండ--సాధువుకొండ ప్రాంతంలో ఖనిజ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ప్రజల నుంచి పక్కా ఇళ్లు, పింఛన్లు, మౌలిక సదుపాయాలపై పలు సమస్యలు వెలువడ్డాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## మాతా శిశు సంరక్షణకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు



మదనపల్లె, ఆగస్టు 11 (మనస్సాక్షి): గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆధునీకరించిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను జిల్లా కలెక్టర్ శివనారాయణ శర్మ, మదనపల్లె ఎమ్మెల్యే సాజహాన్ బాషా మంగళవారం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో ప్రారంభించారు. ఆధునిక వాహనాల్లో ఆరు గాలి సంచులు, అత్యవసర బటన్, అగ్ని ప్రమాద రక్షణ సదుపాయాలు, భౌగోళిక స్థాన గుర్తింపు పర్యవేక్షణ, పూర్తిస్థాయి శీతలీకరణ సౌకర్యాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అనంతరం బాలింతలు, శిశువులు, సహాయకులను వారి నివాసాలకు ఉచితంగా చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణీలు, రక్తహీనత చికిత్స అవసరమైన వారిని ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు ఈ వాహనాలను వినియోగించనున్నారు. మదనపల్లె జిల్లాకు 12 వాహనాలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. 102 ఉచిత సేవా నంబర్‌కు ఫోన్ చేసి ఈ సేవలను పొందవచ్చని అధికారులు వెల్లడించారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యానికి నూతన వాహనాలు



మార్కాపురం ఆగస్టు 11 (మనస్సాక్షి): తల్లీబిడ్డల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించేలా నూతన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను మార్కాపురం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సురక్షితమైన, వేగవంతమైన ఉచిత రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల పేదలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేలా ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను మరింత సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

# గ్రామీణాభివృద్ధిపై అధికారుల సమీక్ష



ముద్దనూరు ఆగస్టు 11 (మనస్సాక్షి): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ముద్దనూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల, డివిజన్ స్థాయి అధికారులు సమావేశమై వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## నల్లింగాయపల్లిలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం



కమలాపురం, ఆగస్టు 11 (మనస్సాక్షి): కమలాపురం మండలం నల్లింగాయపల్లిలో మండల వ్యవసాయ అధికారి ఎం. సరస్వతి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. మినుము, వేరుశనగ పంటల్లో పాటించాల్సిన మెరుగైన వ్యవసాయ పద్ధతులు, ఏపీ ఫార్మర్ ఐడీ ప్రాధాన్యతను రైతులకు వివరించారు. పీఎండీఎస్ విత్తనాలతో నేల సారాన్ని పెంచే విధానాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. రైతులు ఏఐఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాతావరణం, ఎరువుల లభ్యత, చీడపీడల నివారణపై సూచనలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు అఖిశ, రైతులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్లలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి ఘన స్వాగతం

-బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు..





యర్రగుంట్ల, ఆగస్టు 11 (మనస్సాక్షి): కడప జిల్లా, ఎర్రగుంట్లలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి ఎర్రగుంట్ల పట్టణంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట నాయుడు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పార్థసారథి ఎర్రగుంట్లకు చేరుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బాణసంచాలు పేల్చి, నినాదాలతో ఎమ్మెల్యే పార్థసారథికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ఎర్రగుంట్లలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం ఆయనను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట నాయుడు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ తనకు ఎర్రగుంట్లలో లభించిన ఆత్మీయ స్వాగతం పట్ల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు వెంకట నాయుడు, వ్యాపారవేత్త నల్లబల్లె రవి అలియాస్ ప్లాట్ల రవి , నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ భాష, జిలాని భాష, టిడిపి కార్యకర్త ఎర్రి స్వామి, రామాంజనేయ రెడ్డి, పందిళ్ళపల్లి లక్ష్మిరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily
బుధవారం, 12 ఆగష్టు 2026

# గర్భిణులకు సురక్షిత మాతృత్వంపై అవగాహన





కమలాపురం, ఆగస్టు 11 (మనస్సాక్షి): కమలాపురం నగర పంచాయతీ లోని సిహెచ్ సి నందు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఇంచార్జ్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డా. హర్షిత గైనకాలజిస్ట్ హాజరై గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలు, మందుల వినియోగం, ప్రసవ సమయంలో మరియు ప్రసవం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి గర్భిణీలకు సమగ్రంగా అవగాహన కల్పించారూ. ఈ కార్యక్రమానికి హజరైన గర్భిణీలను పరీక్షించి, అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించారు. అలాగే ఈ 19 మంది గర్భిణీలలో హై రిస్క్ ప్రెగ్నెన్సీలను ముందస్తుగా గుర్తించి, మెరుగైన వైద్యం మరియు తదుపరి నిర్వహణ కోసం రిమ్స్, కడపకు రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీలకు సురక్షితమైన మాతృత్వం, ఆరోగ్యకరమైన ప్రసవం గురించి అవసరమైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా తమకు సురక్షితమైన మాతృత్వం, ఆరోగ్యకరమైన ప్రసవం గురించి అవసరమైన అవగాహన కల్పించినందుకు గర్భిణీలు డా.హర్షిత కి, డా.శిరీష కి కృతజ్ఞతలు తెలిపారు...

# నిరుద్యోగులతో చలగాటం వద్దు: టీడీపీ



గాలివీడు ఆగస్టు 11 (మనస్సాక్షి): డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని గాలివీడు మండల టీడీపీ అధ్యక్షుడు హేమకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్ రియాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుద్యోగులను రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో అనేక డీఎస్సీలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని తెలిపారు. మెరిట్ ఆధారంగా పారదర్శకంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ చేస్తున్న విమర్శలను నిరుద్యోగులు నమ్మరని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గాలివీడులో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ





గాలివీడు ఆగస్టు 11 (మనస్సాక్షి): మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండో, మూడో సంవత్సరాలకు సంబంధించిన అంశాలపై కార్యకర్తలకు శిక్షణ అందిస్తున్నారు. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఈ శిక్షణలో ఒక్కో విడత మూడు రోజుల పాటు కొనసాగనుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించడం, బోధనా పద్ధతులు, పిల్లల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొంటున్నారు.

# కూటమి పాలనలో ఇంటింటికి సంక్షేమం అభివృద్ధి

**-మాధవరంలో ఘనంగా 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం**

**-టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి**

**-స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు**

**- సింగల్ విండో చైర్మన్ దశరథ రామానాయుడు (దశ )**

**-మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవహర్ భాష**



సిద్ధవటం ఆగస్టు 11 (మనస్సాక్షి) : రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం మండలం మాధవరం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.స్థానిక సమస్యలను, ప్రజల విజ్ఞప్తులను అడిగి తెలుసుకుంటూ వారి అర్జీలను స్వీకరించారు. పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ విధానాలకు గ్రామీణ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజల సంతోషంగా ఉన్నారని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమమే రానున్న రోజుల్లో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఐటీడీపీ అధ్యక్షులు పెగడ హరి ప్రసాద్,బాషా మరియు భారీ సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో సిద్ధవటం విద్యార్థి ప్రతిభ

**-ఎగువపేట విద్యార్థికి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్**



సిద్ధవటం, ఆగస్టు 11 (మనస్సాక్షి): మండలంలోని ఎగువపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దాసరి అఖిలేష్ ప్రతిష్ఠాత్మక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రతిభతో ఈ స్కాలర్‌షిప్ సాధించడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సునీత మాట్లాడుతూ పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అఖిలేష్ ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. కష్టపడి చదివి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్ పథకం కింద ఎంపికైన విద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందజేస్తారని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ఉన్నత విద్య కొనసాగించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అఖిలేష్ విజయాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు రామమూర్తి, దత్తాత్రేయతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అతడిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి సాధించిన విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన


**-వర్షాభావ పరిస్థితుల్లో పంటల సంరక్షణకు శాస్త్రీయ సూచనలు**

**-వరి పొలాలను పరిశీలించి.. లవణీయత నివారణకు పలు సలహాలు**



చెన్నూరు, ఆగస్టు 11 (మనస్సాక్షి): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు శాస్త్రీయ సలహాలు అందించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం ఊటుకూరు (కడప), వ్యవసాయ శాఖ చెన్నూరు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బలసింగనపల్లి గ్రామంలో రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ శిల్పకళ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కృష్ణప్రియ, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కే. సాయి మహేశ్వరీ, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస గ్రామంలోని వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరి పొలాల్లో లవణీయత (ఉప్పుదనం) తీవ్రంగా ప్రభావం చూపుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కొన్ని పొలాల్లో ఆకులు ఎండిపోయే లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. పంట నష్టాన్ని తగ్గించేందుకు జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి ఫోలియర్ స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల నిర్వహణ, నీటి సంరక్షణ, పురుగు--తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలను కాపాడుకునేలా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కాలువలు, వాగులను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వెంచర్లు



మదనపల్లె ఆగస్టు 11 (మనస్సాక్షి): వేంపల్లె గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములైన వాగులు, కాలువలను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మండల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్లు 735లోని వాగు, 737లోని కాలువ భూములను ఆక్రమించి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వాగులను పూడ్చివేయడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి రైతుల పొలాలు, నివాస ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ, సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.

# అక్రమ మద్యం నియంత్రణపై ప్రత్యేక దృష్టి



కడప, ఆగస్టు 11 (మనస్సాక్షి): ఆబ్కారీ శాఖకు నిర్దేశించిన రాబడి లక్ష్యాలను సాధించడంతో పాటు అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మద్యపాన నిషేధం, ఆబ్కారీ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో మంగళవారం వైఎస్సార్ కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల ఆబ్కారీ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రాబడి లక్ష్యాల పురోగతిని పరిశీలించిన ఆయన, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సరిహద్దు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసి అక్రమ మద్యం కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



# తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



కడప, ఆగస్టు 11 (మనస్సాక్షి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు 11, 12 తేదీల్లో తల్లీబిడ్డల ఆరోగ్యంపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను కడప జిల్లాలో విస్తృతంగా చేపట్టారు. ఇందులో భాగంగా వీధి నాటకాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై చైతన్యం కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, పోషకాహారంపై సూచనలు అందిస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఆరీఫుల్లా, డాక్టర్ మహమ్మద్ తహా, డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లాలో ఉద్యోగ మేళా

కడప ఆగస్టు 11 (మనస్సాక్షి): జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న ప్రొద్దుటూరులోని వేదవ్యాస డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుంది. 2025, 2026 సంవత్సరాల్లో బీఎస్సీ, బీకాం, బీఏ, బీబీఏ, బీబీఎం, బీఎంఎస్, బీఏఎఫ్, బీబీఐ తదితర డిగ్రీలు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి సమాచార సాంకేతిక, సాంకేతిక సహాయ విభాగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి అండేలా సురేష్ కుమార్ తెలిపారు.

# పెనగలూరులో న్యాయ విజ్ఞాన సదస్సు




కడప ఆగస్టు 11 (మనస్సాక్షి): పెనగలూరు ఎంపీడీఓ సభ భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ న్యాయ సేవా పథకాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం, బాల్య వివాహాల నిషేధం, పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం, జాతీయ లోక్అదాలత్, శాశ్వత లోక్అదాలత్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, న్యాయవాదులు, న్యాయ సేవా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# హరిత విస్తీర్ణం పెంపులో భాగంగా మొక్కలు నాటిన పర్యాటక శాఖ



కడప, ఆగస్టు 11 (మనస్సాక్షి): కడప ఏపీటీడీసీ హరిత హోటల్ ప్రాంగణంలో హరిత విస్తీర్ణం పెంపులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖాధికారి ఎ. సురేష్ కుమార్, డీవీఎం మల్లికార్జున గౌడ్‌తో పాటు పర్యాటక శాఖ, ఏపీటీడీసీ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

# పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన కడప జిల్లా సిబ్బంది



కడప, ఆగస్టు 11 (మనస్సాక్షి): హైదరాబాద్ గచ్చిబౌలిలో జూలై 23 నుంచి 30 వరకు నిర్వహించిన 11వ అఖిల భారత పోలీస్ క్రీడల్లో కడప జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన మహిళా కానిస్టేబుల్ పి. శివకుమారి, ఎస్ఐ ఎస్. మహబూబ్ బాషా, కానిస్టేబుల్ ఎస్.పి. మహబూబ్ బాషాలను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం అభినందించారు. పెంచాక్ సిలాట్ క్రీడలో పి. శివకుమారి 100 కిలోల పైబడిన విభాగంలో రజత పతకం సాధించారు. తైక్వాండో పూమ్సె విభాగంలో ఎస్. మహబూబ్ బాషా, ఎస్.పి. మహబూబ్ బాషాలు పావు ఫైనల్ వరకు చేరి ప్రతిభ కనబరిచారు. వారి విజయాలు జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు 'ఆగండి.. ముఖం కడుక్కోండి.. వెళ్లండి'



కడప ఆగస్టు 11 (మనస్సాక్షి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు చేపట్టిన 'ఆగండి.. ముఖం కడుక్కోండి.. వెళ్లండి' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తర్వాత రహదారులపై ప్రయాణించే లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్ల డ్రైవర్లకు పోలీసులు నీటితో ముఖం కడిగించి పంపుతున్నారు. నిద్రమత్తుతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కాకుండా అప్రమత్తంగా ఉండాలని డ్రైవర్లకు సూచిస్తున్నారు. తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు




మదనపల్లె, ఆగస్టు 11 (మనస్సాక్షి): జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల పరిధిలో 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 26 నుంచి ఇప్పటివరకు 7 కేసుల్లో 206 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 26 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి అధికారులకు తెలియజేయాలని కోరారు.

# జనావాసాల మధ్య విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణం ఆపాలి



ప్రొద్దుటూరు, ఆగస్టు 11 (మనస్సాక్షి): జనావాసాల మధ్య నిర్మిస్తున్న విద్యుత్ ఉపకేంద్రం పనులను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకుడు ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు. వందలాది స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 10--15 అడుగుల ఇరుకైన రహదారుల మధ్య అధిక సామర్థ్యం గల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం ప్రమాదకరమని, అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు రావడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జనసాంద్రత తక్కువగా ఉన్న సురక్షిత ప్రాంతంలో ఉపకేంద్రాన్ని నిర్మించాలని కోరారు. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలతో చర్చించాలని ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు. ప్రజల భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# చిట్వేల్‌లో 3.5 కిలోల గంజాయి స్వాధీనం

చిట్వేల్ ఆగస్టు 11 (మనస్సాక్షి): మండలంలోని చెర్లోపల్లి వంతెన సమీపంలో పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,000 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కోడూరు గ్రామీణ సీఐ డి. శ్రీనివాసులు, చిట్వేల్ ఎస్ఐ ఎస్. వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అరెస్టయిన నిందితులు పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా పోలీసులు కోరారు.

# విద్యార్థులను రాజకీయ నిరసనలకు తరలించడంపై బీటెక్ రవి ఆగ్రహం

పులివెందుల ఆగస్టు 11 (మనస్సాక్షి): వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసన ర్యాలీకి కళాశాల విద్యార్థులను తరలించడంపై మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించుకోవడం సరికాదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలు వ్యవహరించాలని ఆయన సూచించారు.

# నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు




యర్రగుంట్ల, ఆగస్టు 11 (మనస్సాక్షి): కడప జిల్లా, యర్రగుంట్ల టౌన్ లో శ్రీశ్రీశ్రీ సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలను నాయీ బ్రాహ్మణులూ భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వాహించారు. ఈ త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలను త్యాగరాజస్వామి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళ వాయిధ్యాలతో, నాదస్వర ఆలాపనలతో,భక్తి గీతాల నడుమ,ముద్దనూరు రోడ్డులోని ఐసిఎల్ ఫ్యాక్టరీ సమీపం నుండి, వేంపల్లి రోడ్డు, కడప రోడ్డు,పట్టణ ప్రధాన వీధులలో శ్రీశ్రీశ్రీ సద్గురు త్యాగరాజస్వామి ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపులో భక్తులు,స్వామి వారిని దర్శించుకొని,పూజలు నిర్వహించి,స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు, యువత ,ప్రజలు పాల్గోనటంతో ఈ కార్యక్రమం పట్టణశీలో ప్రత్యేక ఆకర్షణగా అంగరంగ వైభవంగా జరిగింది.

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284